ఆలయ కమిటీల్లో కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్లు

మంత్రి కొండా సురేఖకు పీసీసీ చీఫ్ సిఫారసు లేఖ

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాలను సైతం రాజకీయ వేదికలుగా మార్చుతున్నది. ఆలయ కమిటీల్లో కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్లను సభ్యులుగా నియమించేందుకు సన్నాహాలు చేస్తున్నది. దేవాలయ కమిటీలు, ట్రస్ట్ బోర్డులలో సోషల్ మీడియా కోఆర్డినేటర్లను సభ్యులుగా నియమించాలని కోరుతూ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ లేఖ రాశారు. వీరిని కమిటీల్లో నియమించడం ద్వారా సోషల్ మీడియా వేదికగా ఆలయాల్లో నిర్వహించే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేస్తారని సూచించారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పిస్తామని ఇటీవల నిర్వహించిన సమావేశంలో మహేశ్‌కుమార్ గౌడ్ కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్లకు హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే ప్రస్తుత చర్యలు తీసుకున్నట్టు తెలిసింది. టీపీసీసీ చీఫ్ సిఫారసును మంత్రి కొండా సురేఖ అంగీకరించినట్టుగా తెలిసింది. కొత్తగా నియమించే ఆలయాల కమిటీల్లో కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్లను నియమిస్తామని చెప్పినట్టుగా తెలిసింది.

నేడు గ్రూప్-4 స్పోర్ట్స్ అభ్యర్థుల వెరిఫికేషన్

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్-4 క్రీడా కోటా అభ్యర్థులకు సోమవారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది. నాంపల్లిలోని శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఉదయం 10:30 గంటల నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నది. షార్ట్ లిస్టులోని అభ్యర్థుల్లో ఎవరికైనా సర్టిఫికెట్లు అందుబాటులో లేకపోతే రిజర్వు డే అయిన మంగళవారం వెరిఫికేషన్‌కు హాజరుకావచ్చని పేర్కొన్నది.

విస్తీర్ణం పెరుగుతున్న హిమాలయ సరస్సులు

న్యూఢిల్లీ: వాతావరణ మార్పుల ప్రభావం హిమాలయ పర్వత ప్రాంతంలో తీవ్రంగా కనిపిస్తున్నది. ఇక్కడి మంచు నీటి సరస్సులు, ఇతర జలాశయాల విస్తీర్ణం 2011తో పోల్చితే 2024లో 10.81 శాతం పెరిగింది. దీంతో వరదలు వచ్చే ముప్పు తీవ్రమైందనే సంకేతాలు వస్తున్నాయి. ఉపరితల ప్రాంతం 33.7 శాతం పెరిగిందని, సరస్సులు మరింత ఎక్కువగా పెరిగాయని కేంద్ర జల కమిషన్ నివేదిక తెలిపింది. మన దేశంలో 2011లో మొత్తం మంచు నీటి సరస్సుల ఇన్వెంటరీ ఏరియా 1,962 హెక్టార్లు కాగా, 2024 సెప్టెంబరునాటికి ఇది 2,623 హెక్టార్లకు పెరిగినట్లు తెలిపింది. మన దేశంలో 67 సరస్సుల ఉపరితల విస్తీర్ణం 40 శాతానికిపైగా పెరిగింది. ఈ ప్రాంతాల్లో వరదలు సంభవించే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లలో మంచు నీటి సరస్సులు విస్తరిస్తుండటం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇది వరద ముప్పునకు సంకేతం కాబట్టి, పర్యవేక్షణను పెంచాలి, విపత్తు నిర్వహణకు సంసిద్ధం కావాలి అని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రైతుల ఓట్లు కావాలె.. వడ్లు వద్దా?

- రైతులను గోసపెడుతున్న కాంగ్రెస్
- నమ్మి గెలిపించి మోసపోయిండ్రు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు పేరుకే ప్రారంభం
- ఎక్కడా ధాన్యం సేకరణ చేస్తలేరు
- 30 శాతం ధాన్యం దళారులే కొన్నరు
- క్వింటాల్ వడ్లపై రూ.వెయ్యి నష్టం
- మద్దతు ధర ఇవ్వకుంటే ధర్నాలు చేస్తం
- మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపాటు

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/నంగునూరు : నమ్మిన పాపానికి రైతులను కాంగ్రెస్ నట్టేట ముంచిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. 'మద్దతు ధర లేదు..బోనస్ రాదు.. రేవంత్‌రెడ్డి పాలనలో ప్రతి రైతు క్వింటాల్‌కు వెయ్యి రూపాయలు నష్టపోతున్నడు' అంటూ నిప్పులు చెరిగారు. రైతుల ఓట్లు కావాలని గాని, వారు పండించిన వడ్లు మాత్రం వద్దా? అని నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని తక్షణమే వడ్ల కొనుగోళ్లపై సీఎం సమీక్ష పెట్టాలని, మిల్లులతో టయప్ చేయాలని, క్షేత్రస్థాయికి రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు వచ్చి పరిశీలించాలని సూచించారు. 'సివిల్ సప్లయిస్, వ్యవసాయ శాఖ అధికారులు ఎక్కడున్నరో తెల్వది.. కొనుగోలు కేంద్రాలను సందర్శించరు..రైతుల కష్టాలు చూడరు.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మద్దతు ధర ఇవ్వకుంటే పెద్ద ఎత్తున ధర్నాలు చేయాల్సి వస్తుంది' అని హెచ్చరించారు. అభాసుపాలు కాకముందే రైతుల ఆగ్రహానికి గురికాక ముందే కండ్లు తెరవాలని, హైదరాబాద్‌ను విడిచి సీఎం, మంత్రులు వడ్ల మార్కెట్లకు వచ్చి రైతులకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూరు మండలం బద్దిపడగలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని హరీశ్‌రావు సందర్శించి రైతులతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల బతుకులు గాలిలో దీపంలా తయారయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఆదిలాబాద్ జిల్లాలో సోయాబీన్ కొని రెండు నెలలవుతున్నా ఇంత వరకు రైతులకు పైసలు వేయలేదని చెప్పారు. ప్రభుత్వంపై రైతులకు నమ్మకం పోయిందని, ఈ ముఖ్యమంత్రి పైసలు వేస్తాడో వేయడోనని రైతులు ప్రైవేట్‌కు అమ్ముకుంటున్నారని తెలిపారు.

కేంద్రం నుంచి ఇంటికి పోలేని దుస్థితి

కొనుగోలు కేంద్రాల్లో రైతులతో మాట్లాడితే దాదాపు 30 శాతానికి పైగా దళారులే వడ్లు కొనుక్కొని పోయారని చెప్పారని, ఈ ప్రభుత్వంలో వడ్లు కొనే దిక్కులేదని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. పొద్దుందాక కోతులు, రాత్రిపూట అడవి పందుల బెడద ఉన్నదని, ఆరుగాలం కష్టపడ్డ పంటకు కనీసం మద్దతు ధర దొరకని దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల ముందు రైతుల మద్దతు తనకు కావాలన్న రేవంత్‌రెడ్డి, ఇప్పుడు రైతులకు మద్దతు ఇస్తలేడని విమర్శించారు. వడ్లు కల్లాలకు రాకముందే గన్నీ సంచులు పంపి, రైస్ మిల్లులను అలాట్ చేసి రైతుల వద్ద గింజ కూడా లేకుండా కొనుగోలు చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. సెంటర్‌లో దుర్గయ్య అనే రైతును మాట్లాడిస్తే 15 రోజులు అవుతున్నదని, కనకయ్యను పలకరిస్తే నెల రోజులు, భద్రవ్వను అడిగితే పది రోజులైందని చెప్పారని, నెల కింద రైతులు వడ్లు తెచ్చినా ఇప్పటికీ ప్రభుత్వం సంచులు ఇవ్వలేదని, మిల్లులను కేటాయించలేదని మండిపడ్డారు. ఇవ్వాళ రైతులు కొనుగోలు కేంద్రం నుంచి ఇంటికి పోలేని దుస్థితి వచ్చిందన్నారు. వడ్లు కొనకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారని, జగిత్యాల, సూర్యాపేట, సిరిసిల్ల జిల్లాల్లో ధర్నాలు చేస్తున్నారని గుర్తుచేశారు.

రేవంత్‌రెడ్డీ.. రైతుల బాధలు చూడు

రేవంత్‌రెడ్డీ.. వడ్ల కొనుగోలు కేంద్రాలకు రా.. వచ్చి రైతుల కష్టాలు, వారి బాధలు చూడు' అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రిగా నువ్వు రావు, నీ మంత్రులు రారు. ఇయ్యాళ మీ ప్రభుత్వం రైతులను గోస పుచ్చుకుంటున్నది' అని మండిపడ్డారు. 'ఆ రోజు కేసీఆర్ రైతుబంధు రెండు సార్లే ఇస్తాండు.. మేము మూడు సార్లు ఇస్తం అన్నవు నువ్వు ఇవ్వాళ ఒక్కసారికే ఎగబెట్టినవు' అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ వస్తే రైతులకు ఇస్తామన్న రూ.15 వేలు ఏవీ అంటూ నిలదీశారు.

> కేసీఆర్ హయాంలో కరోనా సమయంలోనూ రైతు బంధు ఇచ్చిండు.. ప్రభుత్వానికి ఆదాయం లేకున్నా సమయానికి రైతు బంధు ఇచ్చి రైతులను ఆదుకున్నడు.. 11 విడతల్లో రూ.72,815 కోట్ల రైతుబంధు వేసిండు. కాంగ్రెస్ వస్తే రైతులకు 15 వేలు ఇస్తనన్నవ్.. ఏవీ? ఉన్న రైతు బంధును కూడా ఎగ్గొడితివి..
> –హరీశ్‌రావు

వడ్ల బోనస్ తుస్సు

'రూ. 500 బోనస్ ఇయ్యవు.. బోనస్ తుస్సుమన్నది.. రైతులను ఎటుకాకుండ చేసినవు. రైతుల ఉసురు పోసుకుంటున్నవు.. మక్కలు కొనే దిక్కులేదు. ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు.. రూ.7,521 పెట్టి కొనాల్సిన పత్తిని 5 వేలకు అమ్ముకుంటున్నరు. వడ్లు కొనక దళారుకు రూ.1800కు అమ్ముకుంటున్నరు. ఆంధ్రా నుంచి వచ్చి తెలంగాణలో రూ. 1800కు వడ్లు కొనుక్కపోతున్నరు. క్వింటాల్ మీద రైతులు మూడు, నాలుగు వందలు నష్టపోతున్నరు' అని హరీశ్ ధ్వజమెత్తారు. 'రైతులు పంట పండించాలంటే కష్టపడాలె.. ఇప్పుడు పండించిన పంటను అమ్ముకోవాలన్నా కష్టపడాలెనా? ఇదేనా మీరు రైతులకు చేసే సేవ' అని నిలదీశారు. రైతులకు ఇచ్చిన మాట ఒక్కటైనా నిలబెట్టుకున్నవా? అని సూటిగా ప్రశ్నించారు. 'రుణమాఫీ సగం మందికి ఎగబెడితివి.. ఇంక 22 లక్షల మందికి రుణమాఫీ కాలే. 31 రకాల కోతలు పెడితివి. రైతుబంధు ఇయ్యకపోతివి' అని ఫైర్ అయ్యారు. కేసీఆర్ హయాంలో కరోనా సమయంలోనూ రైతులకు రైతుబంధు ఇచ్చారని, ప్రభుత్వానికి ఆదాయం లేకున్నా సమయానికి రైతుబంధు ఇచ్చి ఆదుకున్నాడని గుర్తుచేశారు. 'ఇయ్యాళ లక్షా 50వేల కోట్లు పెట్టి మూసీ సుందరీకరణ చేస్తా అంటున్నవ్.. రైతులకు ఇయ్యమంటే పైసలు లేవ్ అంటున్నవ్.. అన్నం పెట్టే రైతును కాపాడుతవా? మూసీ సుందరీకరణకు పెడుతవా? ఏది నీ మొదటి ప్రాధాన్యత?.. ఓట్ల ముంగిట అన్ని పంటలకు బోనస్ అంటివి.. ఏది నీబోనస్.. ఇయ్యాళ 90 శాతం దొడ్డువడ్లు పండుతయి. 10 శాతం మాత్రమే సన్న వడ్లు పండుతయి.. రైతులను మోసం చేసినవ్' అని నిప్పులు చెరిగారు.

కొనుగోలు కేంద్రాలకు రండి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఇప్పటికైనా వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల కష్టాలు తెలుసుకోవాలని హరీశ్‌రావు సూచించారు. క్షేత్ర స్థాయిలో రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 'హైదరాబాద్‌లో కూర్చుండి డైలాగులు కొట్టుడు కాదు.. ఏ ఊరి కల్లానికి వస్తవో రా.. ఒక్క లారీ అన్న పోయిందా? ఇంత వరకు మిల్లులను టయప్ చేయలేదు. రైతులకు మద్దతు ధర రాకుంటే నువ్వు మాట్లాడవా?' అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. రైతులు కళ్లల్లోనే పడిగాపులు కాస్తున్నారని, వాళ్లు యాసంగి పనులు చేసుకోవద్దా? అని ప్రశ్నించారు. ఓవైపు అకాల వర్షాలతో చాలాచోట్ల వడ్లు తడిస్తే ఎందుకు కొంటలేరని నిలదీశారు. కొనుగోలు కేంద్రాల వద్ద కొబ్బరి కాయలు కొట్టుడు ఫొటోలకు ఫోజులు ఇవ్వడం తప్ప వడ్లు మాత్రం కొంటలేరని మండిపడ్డారు. కనీసం వడ్ల కొనుగోలు కేంద్రాలకు కలెక్టర్లు కూడా రావడం లేదన్నారు.సిద్దిపేట జిల్లాలో 3 లక్షల 60 వేల ఎకరాల్లో వానకాలం పంట సాగైందని, దీని ప్రకారం 9 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండుతాయని, ఇప్పటి వరకు 800 మెట్రిక్ టన్నుల వడ్లే కొన్నారని, ఇప్పటికి కనీసం వెయ్యి మెట్రిక్ టన్నులు కూడా కొనలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 11 విడతల్లో రూ.72,815 కోట్ల రైతుబంధు వేశాడని హరీశ్‌రావు గుర్తుచేశారు. మీడియా సమావేశంలో నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, దువ్వల మల్లయ్య, కిష్టారెడ్డి, ఎడ్ల సోంరెడ్డి, లింగంగౌడ్, రమేశ్‌గౌడ్, సారయ్య, భిక్షపతి నాయక్ పాల్గొన్నారు.

> గత వానకాలంలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్ని వడ్లు కొన్నది.. ఇప్పుడు మీరు ఎన్ని వడ్లు కొన్నారో? చెప్పండి. అప్పుడు మీ కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు బయట పడుతది. కనీసం సంచులు కూడా పంపని చేతకాని ప్రభుత్వమిది. బరువు తక్కువైందని కోతలు పెడుతున్నరు. జాలీలు కూడా సక్కగలేవు. టార్పాలిన్ కవర్లకు దిక్కు లేదు. ఏదీ సక్కగ ఇవ్వని చేతగాని ప్రభుత్వమిది.
> –హరీశ్‌రావు

> మండల కొద్ది కోతులు వచ్చి వడ్ల మీద పడుతున్నయి.. రాత్రి పూట అడవి పందులు వస్తున్నయి.. వాటి కావలే కాస్తున్నమని రైతులు బాధపడుతున్నరు. ఇయ్యాల కాంగ్రెస్ హయాంలో రైతులకు కల్లాల కాడ కావలి కాసే దుస్థితి వచ్చింది. కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యం కొనక నెల రోజుల నుంచి ఇక్కడే ఉంటున్నమని రైతులు కండ్ల నీళ్లు పెట్టుకుంటున్నరు. ఇదంతా సర్కారుకు కనిపిస్తలేదా?
> –హరీశ్‌రావు

> ఓట్లప్పుడు ఊరూరికి తిరిగితివి కదా? ఇయ్యాల ఎందుకొస్తలేవు? రైతుల ఓట్లు కావాలెగని వాళ్లు పండించిన వడ్లు వద్దా? ఒక్కనాడన్న ధాన్యం మీద రివ్యూ చేసినవా? కొనుగోలు కేంద్రాలంటే ఏంది? రైతుల కష్టాలు ఎట్లుంటయి? అని ముఖ్యమంత్రిగా ఏనాడన్న పట్టించుకున్నవా? కనీసం అధికారులతో నైనా మాట్లాడినవా?
> –హరీశ్‌రావు

పేద విద్యార్థులపై చిన్నచూపా? : హరీశ్

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): పేద విద్యార్థులంటే సర్కార్‌కు చిన్నచూపేందుకని హరీశ్ ప్రశ్నించారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన గురుకులానికి చెందిన 60 మంది విద్యార్థులు దవాఖాన పాలైన ఘటనపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. గురుకుల విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం శాపంగా మారిందని మండిపడ్డారు. అభం..శుభం తెలియని నిరుపేద విద్యార్థులు ప్రజాపాలనలో ఆగం కావలసిందేనా? అని ప్రశ్నించారు. వాంకిడి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 60 మంది విద్యార్థులు అస్వస్థత గురైతే ప్రభుత్వానికి చీమకుట్టినట్టయినా లేకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న దవాఖానల్లో విడతల వారీగా విద్యార్థులను చేర్చి చేతులు దులుపుకొంటున్నారని విమర్శించారు. 'వెంటిలేటర్ మీదకు చేరిన ఆ విద్యార్థిని పరిస్థితికి బాధ్యులెవరు? సకాలంలో వైద్యం అందించడంలో ఎందుకు విఫలమయ్యారు?' అని నిప్పులు చెరిగారు. విద్యాశాఖ కూడా ముఖ్యమంత్రి వద్దే ఉన్నా రోజురోజుకూ దిగజారుతున్న గురుకులాల ఖ్యాతిని నిలిపే ప్రయత్నం చేయకపోవటం సిగ్గుచేటని మండిపడ్డారు.

సర్కారు 'కొనుగోళ్లు' బంద్!

- కొనుగోళ్లను ప్రైవేటుకే వదిలేసిన సర్కార్
- ధాన్యం, పత్తి కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం
- మద్దతు ధర దక్కక రోడ్డెక్కుతున్న అన్నదాతలు
- రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లిలో దళారులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీ లోడు చేస్తున్న పొరుగు రాష్ట్ర కూలీలు

హైదరాబాద్, నవంబర్ 3(నమస్తే తెలంగాణ): పంటల కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదంటూ రైతులు రోడ్డెక్కుతున్నారు. పంటలను కొనుగోలు చేయాలన్న డిమాండ్‌తో ధాన్యం, పత్తి రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. పత్తి పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే తేమ సాకుతో తిప్పి పంపిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యాన్ని కాంటా పెట్టే దిక్కు లేకుండా పోయింది. దీంతో రైతులు ఆయా పంటలను అమ్ముకునేందుకు నానా తిప్పులు పడుతున్నారు. బహిరంగ మార్కెట్‌లో మద్దతు ధర దక్కక, ప్రభుత్వ కేంద్రాల్లో కొనుగోలు చేయక విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కడుపు మండిన రైతులు ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగుతున్నారు.

పేరుకే కొనుగోలు కేంద్రాలు

రాష్ట్రంలో 4,500 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ, మెజార్టీ కేంద్రాల్లో గింజ ధాన్యం కూడా కొనుగోలు చేసిన పరిస్థితి లేదు. కొనుగోళ్లు ప్రారంభించి నెల గడుస్తున్నా ఇప్పటివరకు కనీసం లక్ష టన్నులు కూడా కొనుగోలు చేయలేదని సమాచారం. సీసీఐ కొనుగోలు కేంద్రాల విషయంలోనూ ఇదే పరిస్థితి. అక్కడ పత్తిని కొనుగోలు చేయకుండా రైతులను తిప్పి పంపిస్తున్నారు. దీంతో ప్రైవేటు వ్యాపారులు రైతులను అడ్డంగా దోచుకుంటున్నారు. దొడ్డు ధాన్యం మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,320 ఉండగా మొన్నటివరకు ప్రైవేట్ మార్కెట్‌ల్లో రూ.1,900 వరకు ధర దక్కింది. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించిన రైతులు ఈ లెక్కన క్వింటాలుకు రూ.400 చొప్పున రైతులు నష్టపోయారు. పత్తి పరిస్థితీ అంతే. పత్తి మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,521 ఉండగా ప్రైవేట్ వ్యాపారులు రూ.6,500కు మించి చెల్లించడం లేదు. దీంతో పత్తి రైతులు క్వింటాల్‌కు రూ.వెయ్యి వరకు నష్టపోతున్నారు. ఇప్పుడు ప్రైవేటు మార్కెట్‌లో ఈ రెండు పంటల ధరలు మరింత పడిపోయాయి. ఈ నేపథ్యంలో మద్దతు ధర దక్కకపోవడంతో రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. రోడ్లపై ధాన్యం పారబోసి నిరసన వ్యక్తంచేస్తున్నారు. పత్తి రైతులు సైతం రోడ్లపై పత్తిని పారబోసి ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

కొనుగోళ్లను ప్రైవేటుకు అప్పగించిన ప్రభుత్వం?

ప్రస్తుత సీజన్‌లో ధాన్యం, పత్తి కొనుగోళ్ల తీరు గమనిస్తే, పంటల కొనుగోళ్ల బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకుని, ప్రైవేటు వ్యాపారులకు అప్పగించిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ప్రభుత్వం కొనుగోలు చేసిన పంటల కంటే, ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేసినవే ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే మిల్లర్లు, ప్రైవేటు వ్యాపారులు సుమారు 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు అంచనాలున్నాయి. పత్తి ఉత్పత్తి దాదాపు 25 లక్షల టన్నుల వరకు వస్తుందని అంచనా వేయగా ఇప్పటివరకు సీసీఐ 500 టన్నుల వరకు మాత్రమే కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఇప్పటికే మొదటి కటింగ్ పూర్తికావొచ్చింది. ఇందులో మెజార్టీ భాగంగా ప్రైవేటు వ్యాపారులే కొనుగోలు చేసినట్టు సమాచారం. ఆర్థిక భారాన్ని తగ్గించుకునేందుకే ప్రభుత్వం పంటల కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సన్న ధాన్యం కొనుగోలు చేస్తే క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,320కి అదనంగా రూ.500 బోనస్ ఇవ్వాల్సి ఉంటుంది. దీంతో ప్రభుత్వంపై భారీ మొత్తంలో ఆర్థిక భారం పడే అవకాశం ఉన్నది. అందుకే కొనుగోళ్లను కాస్త ఆలస్యం చేస్తే రైతులు ప్రైవేటుకు విక్రయిస్తారనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బతుకమ్మ తెల్లారి పోసిన

నేను ఎకరం పొల మేసిన 40 క్వింటాళ్లు వచ్చినయ్. ఇంకో 20 గుంటలల్ల సన్నపు వడ్లు పెట్టిన. అవ్వి కల్లంలకు తేలేదు. ఇది వరకు కొన్నట్టే కొంటరని బతుకమ్మ పండుగ తెల్లారి కల్లంల పోసిన. వర్షమచ్చిన ప్రతిసారి ఎత్తుడు, నేర్పుడు, ఇబ్బంది అయితుంది. ఎంతగానం గీ వడ్లకు కావలుండుడు. ఇంక మేం అమ్ముకోలే. ఈడ కావలుండుడు శాన ఇబ్బందైతున్నది.

- నెత్తెట్ల మల్లయ్య, రాగట్లపల్లి, ఎల్లారెడ్డిపేట

రాష్ట్రంలో రైతుల అరిగోస

- తెరుచుకోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- వెయ్యి నుంచి 1,500 మేర తగ్గిన పత్తి ధర
- పంటలు కొనని లీడర్లు పోజులు కొడుతుండ్రు
- రాష్ట్రవ్యాప్తంగా వరి, పత్తి కొనుగోళ్లు చేపట్టాలి
- బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ): సర్కారు నిర్లక్ష్యం ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులు గోసరిల్లుతున్నారని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ధాన్యం కొనుగోళ్లు కాక, మరోవైపు పత్తి ధర పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇవేమీ పట్టని పాలకులు మాత్రం ఫొటోలకు పోజులు కొడుతూ రీల్స్ చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వరికోతలు ప్రారంభమై 40 రోజులు దాటినా ఇంకా ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని మండిపడ్డారు. రూ.10 ఉన్న మిల్లర్ చార్జీలను రూ.40 నుంచి 50కి పెంచుతామని చెప్పి ఇప్పుడు తీరా సమయానికి బేరాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికే నల్లగొండ, సూర్యాపేట, జనగామ ప్రాంతాల్లోని ధాన్యాన్ని ఆంధ్రా మిల్లర్లు తక్కువ ధరకే కొంటున్నారని విమర్శించారు. క్వింటా పత్తి మద్దతు ధర రూ.7,521 ఉంటే రాష్ట్రంలో 5 వేల నుంచి 6 వేలకు కూడా అమ్ముడుపోయే పరిస్థితి లేదని మండిపడ్డారు. గుజరాత్‌లో క్వింటా పత్తి 8 వేల నుంచి 8,500కు కొంటున్నారని, తెలంగాణలో నాణ్యమైన పత్తికి ఆ రేటు ఇవ్వడం లేదని తెలిపారు. ఈ విషయంపై కేంద్రాన్ని అడిగే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి ఎందుకు లేదని ప్రశ్నించారు.

జనగామ జిల్లా పాలకుర్తి మండలం శాతాపురంలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న వ్యాపారస్థుడు

ప్రభుత్వ కేంద్రాల్లో ప్రైవేట్ వ్యాపారులు

- దర్జాగా కాంటాపెట్టి కొనుగోలు
- మెదక్, జనగామ జిల్లాల్లో విచిత్రం
- పట్టించుకోని అధికారులు

చిన్నశంకరంపేట/కౌడిపల్లి/పాలకుర్తి, నవంబర్ 3 : ప్రభుత్వం ఇరవై రోజుల కిందట అట్టహాసంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. కానీ, ధాన్యం కాంటా వేయడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురు,శుక్రవారాల్లో కరిసిన వానకు వడ్లు తడిసి ముద్దయ్యాయి. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తెచ్చి రైతులు కాంటాలకు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వంపై నమ్మకం లేక పోవడంతో రైతులు బయట వ్యాపారులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. వ్యాపారులు ఏకంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు వచ్చి ధాన్యం తూకం వేస్తున్నారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం అంబాజీపేట కొనుగోలు కేంద్రంలో శని,ఆదివారాల్లో వ్యాపారులు రెండు లారీల ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలించారు. కౌడిపల్లి మండలం కొట్టాల గ్రామంలో ఆదివారం రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకున్నారు. జనగామ జిల్లా శాతాపురంలోనూ ఇదే పరిస్థితి నెలకొన్నది. అయినా అధికారులు స్పందించటం లేదు.

మెదక్ జిల్లా అంబాజీపేటలో కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని తూకం వేస్తున్న దళారులు

కాంగ్రెస్‌ది ప్రతీకార పాలన

- 5న జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలి
- బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం

హనుమకొండ, నవంబర్ 3: గత ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది ప్రజాపాలన కాదని, ప్రతీకార పాలన అని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. ఆదివారం హనుమకొండ జిల్లా వడ్డెపల్లిలోని తన నివాసంలో ఆయన ఆటోకార్మిక నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణానికి తాము వ్యతిరేకం కాదని, అయితే పూర్తిస్థాయిలో మహిళలకు ఉచిత ప్రయాణం అందించలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నదని మండిపడ్డారు. రోడ్డునపడ్డ ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయం చూపించాల్సిన ప్రభుత్వం స్పందించకపోవడంతో ఇప్పటికే కొందరు ఆటో కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ప